వినతులు.. నిరసనలు

• కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు • సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో పలువురి విజ్ఞప్తి

సిరిసిల్లటౌన్: జిల్లా వ్యాప్తంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ బాధితులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. పెండింగ్‌లో ఉన్న తమ అర్జీలపై కొందరు, వివిధ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలంటూ మరికొందరు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిశారు. నేరుగా ఆయన వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

పింఛన్ ఇప్పించండి



మాపాప అనన్యకు చిన్నతనం నుంచి మతిస్థిమితం సరిగా లేదు. మెదడులోని నరాలు దెబ్బతిన్నాయి. ఎన్ని ఆస్పత్రులకు తిప్పినా..నయం కావడం లేదు. పింఛన్ అందించి ఆదుకోవాలి.

– కాసారపు చంద్రం దంపతులు, కొండాపూర్

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



సిరిసిల్ల శివారులోని పెద్దూరులో తండ్రి లింగయ్య పేరుపై ఉన్న పదిగుంటల స్థలాన్ని 2011లో మాజీ వైస్‌చైర్మన్‌కు విక్రయించాం. దాని పక్కనే ఉన్న మాకు చెందిన స్థలాన్ని పీపీబీ ద్వారా తన పేరుపైకి మార్చుకుని కబ్జా చేస్తున్నాడు. ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. రిజిస్ట్రేషన్ సమయంలో తన ఇంటి నంబర్, పీపీబీ చేయించుకునే సమయంలో ఇంటినంబర్‌ను వేరుగా చూపిస్తూ..అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలి

– దుబాల బుచ్చిరాజు, నెహ్రూనగర్

మా భూమిని ఆన్‌లైన్ చేయాలి



తమ సామాజిక వర్గానికి చెందిన 100 కుటుంబాలు కలిసి భూమిని కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్న భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాళ్లపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్ కోరారు. తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్‌లో సర్వేనంబర్ 53/6లో ఐదెకరాలు, 53/4తో ఐదెకరాలు 2000 సంవత్సరంలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. ఇప్పటివరకు కాస్తులో ఉంటున్నా..ధరణి పోర్టల్ నుంచి తమ సర్వేనంబర్లను పూర్తిగా తొలగించారన్నారు. తమ రికార్డులను పరిశీలించి సదరు భూమిని తమ పేర్లతో ఆన్‌లైన్ చేయించాలని కోరారు. దేవయ్య, అంజయ్య, సురేందర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం వేయాలి

జిల్లా కేంద్రంలోని శివనగర్ 29వ వార్డులో కరెంటు స్తంభాలు, హైటెన్షన్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ తెలిపారు. పలుసార్లు విన్నవించామని, రోడ్డుపై వెళ్లేవారికి విద్యుత్ తీగలు తగిలేలా ఉండటంతో మరో విద్యుత్ స్తంభం వేయించి ప్రమాదం జరగకుండా చూడాలని రాజయ్య, జగన్, కనకయ్య, తదితరులు కోరారు.

సీసీరోడ్డు నిర్మాణం ఆపివేయాలి

ముస్తాబాద్ మండల కేంద్రం మానేరు కాల్వపై అనాలోచితంగా సీసీరోడ్డును నిర్మిస్తున్నారని స్థానికులు తెలిపారు. పెట్రోల్‌బంక్ నుంచి పోత్గల్ మెయిన్‌రోడ్డు వరకు 66ఫీట్ల వెడల్పుతో అశాస్త్రీయంగా నిర్మిస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి ప్రజలకు న్యాయం చేయాలని మీస శంకర్ తదితరులు కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

రగుడు సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం కాలనీలో సరైన వసతులు కల్పించాలని బాధితులు కోరారు. కలెక్టరేట్ ముందు మీడియాతో వారు మాట్లాడుతూ..72 డబుల్‌బెడ్రూం ఇండ్లను గత ప్రభుత్వం నిర్మించి ఇచ్చిందన్నారు. సదరు కాలనీలో సీసీరోడ్లు, వీధిదీపాలు, సీసీ కెమెరాలు, ప్రహరీ నిర్మించాలని జి. అనిత, కవిత, సునీత, రేణుక తదితరులు కోరారు.

మూడునెలలుగా పింఛన్ లేదు



ప్రతీనెల వృద్ధాప్య పింఛన్ వచ్చేది. మూడు నెలలుగా పెన్షన్ రావడం లేదు. అధికారులకు విన్నవిస్తే..సమస్య పరిష్కరించడం లేదు. ఈ విషయంలో విచారణ జరిపి న్యాయం చేయాలి.

– చెవుల మల్లయ్య, ముస్తాబాద్

ఎస్సారెస్పీ ద్వారానే పంటలకు సాగునీరు



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: ఎస్సారెస్పీ ద్వారా సిరిసిల్ల రైతులకు సాగునీటిని ప్రభుత్వం అందిస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్ల అధికారంలో ఉండి కూడా తొమ్మిదో ప్యాకేజీ పనులు పూర్తి చేయలేదని, కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు అవినీతికి పాల్పడి ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవకున్న, రైతులు, ప్రజల కోసం ఎస్సారెస్పీ నీటిని తీసుకువచ్చి, పంటలకు నీరందిస్తున్న విషయం రైతులకు తెలుసన్నారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, డీసీసీ కార్యదర్శి కొండం రాజిరెడ్డి, యువజనశాఖ మండల అధ్యక్షుడు రంజాన్ నరేశ్, దీటి నర్సింలు, గుండెల్లి శ్రీను, బొండ్గుల దేవిరెడ్డి, సత్తయ్య, భాను, బాల్‌రెడ్డి, షాదుల్‌పాష, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ రైతులకు క్షమాపణ చెప్పాలి'

ఎల్లారెడ్డిపేట: మల్కపేట రిజర్వాయర్ నుంచి 9వ కెనాల్ ద్వారా నీటిని తీసుకురావడంలో విఫలమైన మాజీ మంత్రి కేటీఆర్ ఈ ప్రాంత రైతులకు క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి మల్కపేట 9వ ప్యాకేజీ పనులను ఎందుకు పూర్తిచేయలేదన్నారు.మిడ్ మానేరు నుంచి 10,11,12 ప్యాకేజీలను పూర్తిచేసి రంగనాయక కొండపోచమ్మ మల్లన్న సాగర్ ప్రాజెక్ట్‌లకు నీటిని నింపి నియోజకవర్గంలోని అప్పర్ మానేర్‌ను నీటితో ఎందుకు నింపలేదన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు గౌస్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాలయ్య, గణపతి, బాబు, బుచ్చాగౌడ్, గుర్రపు రాములు, గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల మరమ్మతు

సాక్షి స్పందన



ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలుగ్రామాల్లో పంటపొలాల్లో వంగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సోమవారం సెస్ అధికారులు మరమ్మతు చేశారు. సోమవారం 'సాక్షి'లో 'పంట పొలాల్లో ప్రమాదకరంగా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సెస్ అధికారులు స్పందించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడెక్కడ విద్యుత్ స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయో గుర్తించారు. నారాయణపూర్, బండలింగంపల్లి, సింగారం, దుమాల, రాగట్లపల్లి తదితర గ్రామాల్లోని పంటపొలాల్లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాల మరమ్మతు, శిథిలావస్థలో ఉన్న వాటి స్థానంలో కొత్తగా స్తంభాలు వేశారు. ఇక్కడ సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లైన్‌మెన్ ప్రవీణ్, హెల్పర్ నవీన్, సతీశ్ పాల్గొన్నారు.

స్పీకర్‌కు రాజేశ్వర్‌రావు ప్రజావాణి బుక్ అందజేత

వేములవాడ: దివంగత చెన్నమనేని రాజేశ్వరరావు శతజయంతి సందర్భంగా 'చెన్నమనేని రాజేశ్వరరావు–లలితాదేవి ఫౌండేషన్' ద్వారా విడుదలైన 'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి చెన్నమనేని' అనే పుస్తకాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఆయన వెంట చెన్నమనేని సోదరులు వెంకటేశ్వరరావు, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఆత్మీయులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు 16 ఫిర్యాదులు

సిరిసిల్ల క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేకు 16 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేస్తూ ఫిర్యాదుదారులకు సత్వర సహాయం అందించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం ఎల్‌ఎండీకి 2500, కుడి కాలువకు 512, ఎడమ కాలువకు 5 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 15.70 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

ఎల్లారెడ్డిపేట: ఓ వివాహితను అదనపు వరకట్నం కోసం వేధించిన ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేటకు చెందిన రేఖకు గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన ఎర్రోళ్ల రమేశ్‌తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పట్లో రూ.5 లక్షలతో పాటు 9 తులాల బంగారం కట్నంగా ముట్టజెప్పారు. పదేళ్ల వీరి కాపురం సాజావుగా సాగింది. గత ఆరేళ్లుగా అదనంగా రూ.5 లక్షలు తీసుకురావాలంటూ భర్త రమేశ్, ఆడబిడ్డలు నేతరి కిష్టవ్వ, ఆరెల్లి శాంతవ్వ, నర్సవ్వ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరో ఇద్దరిపై..

మండలకేంద్రానికి చెందిన దున్నపోతుల లావణ్య అనే వివాహితను అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన దున్నపోతుల రాజుతో లావణ్యకు రెండేళ్ల క్రితం రూ. 4లక్షలు నగదు, బంగారు ఆభరణాలు ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని రోజుల నుంచి భర్త రాజుతో పాటు అత్త కనుకవ్వ అదనపు కట్నం తేవాలని వేధిస్తుండటంతో ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రైవేట్ వాహనమే దిక్కు..!

• నిరుపయోగంగా అంబులెన్స్
• పట్టించుకోని అధికారులు
• అత్యవసర సమయాల్లో రోగుల ఇబ్బంది



గ్రామ పంచాయతీలో అంబులెన్స్

రుద్రంగి: రుద్రంగి గ్రామ ప్రజలకు అత్యవసర వైద్యసేవలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రతిమ ఫౌండేషన్, రుద్రంగి దుబాయ్ సంఘం సహకారంతో గ్రామ పంచాయతీకి అందజేసిన అంబులెన్స్ నిర్వహణ లేక నిరుపయోగంగా ఉంది. రూ.9లక్షలు వెచ్చించి గ్రామస్తుల సౌకర్యార్థం అంబులెన్స్‌ను అందజేశారు. గ్రామస్తులు అత్యవసర సమయాల్లో కోరుట్ల, వేములవాడ పట్టణాల నుంచి అంబులెన్స్‌లను కిరాయికి తెప్పించుకుంటున్నారు. అయినా అవి సమయానికి అందక బాధితుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతిమ ఫౌండేషన్, రుద్రంగి దుబాయ్ సంఘం ఆధ్వర్యంలో అందించిన అంబులెన్స్‌ను వినియోగంలోకి తేవాలని, అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉంచితే ప్రజలకు ఆర్థికభారం తగ్గుతుందని కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..



అంబులెన్స్‌కు చిన్న చిన్న మరమ్మతులు ఉన్నాయి. వెంటనే మరమ్మతు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా వినియోగంలోకి తీసుకువస్తాం.

– రాందాస్, పంచాయతీ కార్యదర్శి, రుద్రంగి

కాలువ పనులు పూర్తిచేయాలి



రిలే దీక్షలో పాల్గొన్న రైతులు

ఇల్లంతకుంట: రంగనాయక సాగర్ ప్రాజెక్టు ఎల్‌ఎం 6 కెనాల్ నిలిచిపోయిన పనులను పూర్తిచేయాలని మండలంలోని పెద్ద లింగాపూర్ పలుగ్రామాల రైతులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం చిన్న లింగాపూర్ సమీపంలో నిలిచిన కెనాల్ వద్ద రైతులు దీక్ష చేపట్టారు. కాలువ పనులు పూర్తయితే బావుల్లో నీటి నిల్వలు పెరిగి పంటలు ఎండిపోకుండా ఉంటాయని గ్రామాల రైతులు పేర్కొన్నారు. వెంటనే నిలిచిపోయిన కాలువ పనులు పూర్తి చేయాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి



కాలువ పనులు పూర్తయితే వ్యవసాయ బోరుబావుల్లో నీటిమట్టం పెరిగి పొలాలకు నీరందుతుంది. త్వరగా కాలువ పనులు పూర్తిచేయాలి. ఎండిపోతున్న పంట పొలాలను ప్రభుత్వం ఆదుకోవాలి. – కరికే నవీన్, పెద్దలింగాపూర్

కార్మికులకు కనీస వేతనాలు అందించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసేలా ప్రభుత్వం జీవో అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే కనీస వేతనాల క్యాంపెయిన్ కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. సిరిసిల్ల బీవైనగర్‌లోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. మార్చి 6 వరకు జిల్లా కలెక్టరేట్ ధర్నాలు మార్చి 7న హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. పవర్లూమ్, బీడీ, సెక్యూరిటీ గార్డు, పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, సూరం పద్మ, నక్క దేవదాస్, బెజుగం సురేశ్, జిందం కమలాకర్, గడ్డం రాజశేఖర్, బత్తుల రమేశ్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు అన్నారు. సోమవారం వేములవాడ మండలం చీర్లవంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, రాములు, దేవయ్య, రమేశ్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్



కోనరావుపేట: పీఎం శ్రీ పథకంలో భాగంగా కోనరావుపేట ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్స్‌ను తయారు చేసి సైన్స్ ఫేర్‌లో ప్రదర్శించారు. మండల విద్యాధికారి మాలోతు మురళి నాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆడెపు రాజేశం హాజరై విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. హెచ్‌ఎం అజ్మీర మన్ లాల్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాము, వెంకటేశం, సంజీవ్, ఉపాధ్యాయురాళ్లు శృతి, అనూష, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే బీటీరోడ్డులో చివరలో ఒకవైపు కయ్య పడింది. దీంతో వాహనదారులు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పలుసార్లు ఇక్కడ ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. వెంటనే అధికారులు ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేపట్టాలి.

–పొత్తూరి రాజేంద్రప్రసాద్, బోయినపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : విష్ణువర్ధన్, పీఆర్, ఏఈ, బోయినపల్లి, సెల్ నంబర్: 9493884010

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బావిలో పడిన మహిళ

వేములవాడరూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళను ఫైర్ సిబ్బంది రక్షించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు అయ్యోరుపల్లికి చెందిన నేదూరి భారత ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడటంతో వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. వేములవాడ ఎస్‌ఎఫ్‌వో అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళను మంచం సహాయంతో బావిలో నుంచి బయటకు తీసి వెంటనే 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహిళకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ఫైర్ మెన్‌లు రాజేంద్రప్రసాద్, శంకర్, ప్రేమ్‌చంద్, ఉపేందర్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన శ్రీధర్

వేములవాడ: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ టౌన్ కమిటీ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ సోమవారం కరీంనగర్‌లో కలిశారు. రానున్న మున్సిపల్ ఎన్నికలు, టౌన్ కమిటీ నియామకంపై చర్చించినట్లు శ్రీధర్ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మడలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, హోమ పూజలు, అంకురార్పన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం, నాయకులు దూది శ్రీనివాస్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, సంతుపూరి బాలకృష్ణారెడ్డి, ఇందూరి మధు, విఠల్, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం దేవునితండా, జైసేలాల్ ఊరుతండాలో మహంకాళి ఆలయంలో శ్రీ భద్రకాళి యంత్ర ప్రతిష్టాపన, మల్కపేటలో బొల్లిగట్టు మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, డైరెక్టర్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, మండల అధ్యక్షుడు మిర్యాలకర్ బాలాజీ, నాయకులు గంగాధర్, మానుక సత్యం, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళాలు అందజేస్తున్న లింగంగౌడ్

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చారు. రూ.2లక్షల విరాళాలు సోమవారం గౌడ సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఎల్లమ్మ ఆలయాన్ని పాలరాతితో నిర్మిస్తుండగా రూ. 80 లక్షల ఖర్చవుతోంది. దీంతో దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందించారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన పందిర్ల లింగంగౌడ్ రూ. 50,116, గంట బాలాగౌడ్ రూ. 50,116, గంట సతీశ్‌గౌడ్ రూ. 50,116, గనగోని బాలకిషన్ రూ. 50,116 ల చొప్పున విరాళాలను గౌడ సంఘం అధ్యక్షుడు నాగుల ప్రదీప్‌గౌడ్‌కు అందజేశారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



రుద్రంగి: మండలకేంద్రంలోని శ్రీ మల్లికార్జున ఆలయం పున:నిర్మాణంలో భాగంగా భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. దాతలు సహాయ సహకారాలు అందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి



ఎగ్జిబిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం 150 ఎగ్జిబిట్లు, వేస్ట్‌మేనేజ్‌మెంట్ అంశంపై పోస్టర్ తయారీ ప్రదర్శన నిర్వహించారు. ముగింపు సమావేశంలో హెచ్‌ఎం బన్నాజీ మాట్లాడుతూ సైన్స్‌తోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు కృష్ణ, బాలరాజు, రాధిక, అరుంధతి, హరికృష్ణ, యాదగిరి, సత్యనారాయణ, మాధవి, సరళ, సరిత, స్వాతి, రవీందర్‌రావు, సవిత, సీఆర్పీ ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఠాణాను తనిఖీ చేసిన ఏఎస్పీ



తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలోని పోలీస్‌స్టేషన్‌ను వేములవాడ ఏఎస్పీ, సిరిసిల్ల ఇన్‌చార్జి ఎస్డీపీవో శేషాద్రినిరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, గంజాయి స్మగ్లింగ్, రేషన్ బియ్యం దందా, ఇసుక అక్రమ రవాణ నిర్మూలనపై ఎస్సై రామ్మోహన్‌కు పలు సూచనలు చేశారు.